## భక్తి శ్రద్ధలతో బక్రీద్



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



తాండూరు చెనిగేష్‌పూర్ రోడ్డులో ముస్లింల సామూహిక ప్రార్థనలు



త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్‌ను సోమవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద పేదలకు దానాలు చేశారు. ఈ వేడుకల్లో ఆయా పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

- తాండూరు/ ఘట్‌కేసర్, జూన్ 17



అదేమిటీ?.. రైతుకు దొరకని 'రేవంత్' అని చూసి ఆశ్చర్యపోతున్నారా?.. మీరు చదువుతున్నది నిజమే.. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కాదండోయ్... 'రేవంత్' పేరుతో ఉన్న పత్తి విత్తనం ఇప్పుడు మార్కెట్‌లో ఎక్కడా దొరకడం లేదు. దీనికి ఎంత డిమాండ్ ఉందంటే ప్రభుత్వం నిర్ధారించిన ధరకు కొన్ని రెట్లు అధికంగా ఇస్తామన్నా ఈ రకం విత్తనం లభించడం లేదు. పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర ఎమ్మార్పీ 864గా ప్రభుత్వం నిర్ధారించింది. కానీ 'రేవంత్' అనే రకం విత్తన షాపుల్లో దొరకడం లేదు. బ్లాక్ మార్కెట్‌లో మాత్రమే దీన్ని అమ్ముతున్నారు. రూ.864లు ఉండే ఈ ప్యాకెట్ ధర ఇప్పుడు బ్లాక్ మార్కెట్‌లో రూ.2,500 నుంచి రూ.3,000 వరకు అమ్ముతున్నారంటే దీని డిమాండ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- కంది విత్తనాలదీ అదే పరిస్థితి
- బ్లాక్‌లో తప్పా మార్కెట్‌లో దొరకని కొన్ని రకాల విత్తనాలు
- రేవంత్ రకం పత్తి ప్యాకెట్ రూ.3,000 వరకు డిమాండ్
- ఈ ఏడాది రైతన్నలకు విత్తన భారం

# రైతుకు దొరకని రేవంత్!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 17) ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వానాకాలం ఆరంభం కావడంతో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు దున్ని విత్తనాలు నాటుతూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది విత్తనాల ధరలు గత ఏడాది కంటే పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ప్రభుత్వం పచ్చిరొట్టవిత్తనాలకు మినహా మిగతా విత్తనాలకు సబ్సిడీ ఇవ్వడం లేదు. మరో వైపు ప్రభుత్వం నిర్ధారించిన ధరలకు ఎక్కడా నాణ్యమైన విత్తనాలు దొరకడం లేదు. ఉమ్మడి జిల్లాలో అధికంగా సాగు చేసే పత్తికి సంబంధించిన కొన్ని రకాల విత్తనాలు మార్కెట్‌లో దొరకడం లేదు. బ్లాక్ మార్కెట్‌లో వీటి ధరలు ఆకాశాన్నంటుతుఉన్నాయి. 'రేవంత్' పేరుతో ఉన్న పత్తి విత్తనం ఇప్పుడు మార్కెట్‌లో ఎక్కడా దొరకడం లేదు. దీనికి ఎంత డిమాండ్ ఉందంటే ప్రభుత్వం నిర్ధారించిన ధరకు కొన్ని రెట్లు అధికంగా ఇస్తామన్నా ఈ రకం విత్తనం దొరకడం లేదు. పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.864గా ప్రభుత్వం నిర్ధారించింది. కానీ 'రేవంత్' అనే రకం విత్తన షాపుల్లో దొరకడం లేదు. గత ఏడాది ఈ రకం విత్తనం సాగు చేసిన వారికి అధిక దిగుబడులు రావడంతో ఈ విత్తనానికి విపరీతమైన డిమాండ్ వచ్చింది. అలాగే బౌన్సర్., ఆద్య అనే పత్తివిత్తన రకాలకు కూడా మార్కెట్‌లో భారీగానే డిమాండ్ ఉంది. వీటిని కూడా రూ.1500 నుంచి రూ.2000 వరకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. రేవంత్‌తో పాటు మిగతా కొన్ని పత్తి రకాలకు డిమాండ్ ఉండడంతో మార్కెట్లోకి వీటి పేరుతో నకిలీ విత్తనాలు కూడా వస్తున్నాయి. ఇటీవల కొందుర్గులో అధికారులు 30 కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నారు. వీటిని ప్యాకెట్ రూ.2000ల చొప్పున విక్రయిస్తున్నారని తెలియడంతో అధికారులు దాడులు నిర్వహించి వీటిని అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లాలో కూడా నకిలీ పత్తి విత్తనాల బెడద అధికంగా ఉంది. ఇటీవల బషీరాబాద్‌లో కూడా పత్తి నకిలీ విత్తనాలు పట్టుకున్నారు.

### పత్తి విత్తనానికి భారీ డిమాండ్

### సన్నాలకు డిమాండ్

రాష్ట్ర అవసరాల దృష్ట్యా సన్నధాన్యం సాగు పెంచాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సన్నరకాల వరిని సాగు చేసే రైతులకు బస్తాకు అదనంగా రూ.500లు బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించింది. సర్కార్ తాజా ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే బియ్యం ధరలకు రెక్కలు రావడంతో ఉమ్మడి జిల్లాలో గత వానాకాలం, యాసంగి సీజన్‌లలో వరి సాగు గణనీయంగా పెరిగింది. ఇప్పుడు ప్రభుత్వం సన్నబియ్యం సాగు చేసే రైతులకు అదనంగా బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో సన్నరకాల వరి సాగు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. సాధారణంగా ఉమ్మడి జిల్లాలో వానాకాలం సగటు దాదాపు 1.72లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు.

### పెరిగిన సాగు

గత వానాకాలం (ఖరీఫ్)లో రికార్డుస్థాయిలో 2.78లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అలాగే యాసంగి (రబీ)లో కూడా రికార్డు స్థాయిలో వరి సాగు జరిగింది. రబీలో సాధారణంగా 1.07లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా గడిచిన రబీలో రెట్టింపు స్థాయిలో 2.14లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ వానాకాలంలో మరింత వరి సాగు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో సన్నా ధాన్యానికి సంబంధించిన వరి విత్తనాలకు డిమాండ్ మొదలైంది. గత ఏడాది 10 కిలోల సాధారణ వరి విత్తనాలధర రూ.650 నుంచి రూ.700 వరకు ఉండగా ఈ ఏడాది రూ. 750 నుంచి 800ల వరకు విక్రయిస్తున్నారు. అదే బీపీటీ, ఆర్ఎస్ఆర్ రకాలు రూ. 1100 నుంచి 1200 వరకు విక్రయిస్తున్నారు. అలాగే మొక్కజొన్న కూడా గత ఏడాది కంటే రూ.50 నుంచి రూ. 100లు (450 గ్రాముల ప్యాకెట్ ధర) అధికంగానే ఉంది.

అలాగే ఉమ్మడి జిల్లాలో కంది సాగు చేసే రైతులు కూడా ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. కందిలోని కొన్ని రకాల విత్తనాలకు అధిక డిమాండ్ ఉండడంతో బ్లాక్ మార్కెట్‌లో వీటిని విక్రయిస్తున్నారు. డిమాండ్ ఉన్న కొన్ని రకాల విత్తనాలకు నకిలీ బెడద తప్పడం లేదు. కందిలో 'ఆశ' అనే రకానికి మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది నాలుగు కిలోల ఈ విత్తన ప్యాకెట్ ధర రూ.440 కాగా ప్రభుత్వం నిర్ధారించింది. ఈ ఏడాది దీని ధర రూ.600లకు పెంచారు.

### 'ఆశ' నిరాశే

అయితే ఈ రకం తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలోనే విక్రయిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు ఇక్కడ అమ్మినా ఇప్పుడు ఇక్కడ కూడా నిల్వలు అయిపోయాయి. దీంతో అయితే బహిరంగ మార్కెట్‌లో ఇదే విత్తనాలను రూ.800ల నుంచి రూ.1200వరకు విక్రయిస్తున్నారు. గత ఏడాది కందికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో తాండూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో కంది వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత ఏడాది కంది క్వింటాల్ ధర రూ.12000 వరకు పలకవడంతో రైతులు ఈ వానాకాలంలోలో కందివైపు మొగ్గుచూపుతున్నారు.

# వికారాబాద్ జిల్లా ఎస్పీగా నారాయణరెడ్డి

- మేడ్చల్ డీసీపీగా కోటిరెడ్డి బదిలీ
- టీజీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్‌గా మేడ్చల్ డీసీపీ నితికా పంత్



కె.నారాయణరెడ్డి



ఎస్.కోటిరెడ్డి



నితికా పంత్

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్/శంషాబాద్ జూన్ 17: వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి బదిలీ అయ్యారు. శంషాబాద్ జోన్ డీసీపీ కె.నారాయణరెడ్డిని వికారాబాద్ జిల్లా ఎస్పీగా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి బదిలీ చేసిన కోటిరెడ్డిని మేడ్చల్ జోన్ డీసీపీగా నియమించారు. 2021, డిసెంబరు 26న జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కోటిరెడ్డి జిల్లాలో రెండున్నర సంవత్సరాలు కొనసాగారు. జిల్లాలో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా కోటిరెడ్డి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. నేరాల నియంత్రణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఫలితంగా జిల్లాలో గత రెండున్నరేళ్లలో నేరాల తీవ్రత శాతం తగ్గింది. కేసుల సంఖ్య పెరిగినా ఘోరాల సంఖ్య తగ్గింది. వివిధ నేర సంఘటనల్లో విచారణ వేగవంతం చేసి నిందితులకు జైలుశిక్ష పడే విధంగా కృషి చేశారు. సామాజిక కార్యక్రమాల్లోనూ పోలీసులు ముందుండేలా ఎస్పీ ప్రోత్సహించారు. సమాజంలో ప్రజలకు సవాల్‌గా మారిన నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ప్రజలను చైతన్య పరిచేలా కృషి చేశారు. సమాజంలో ఎక్కడ మోసపోయిన సంఘటనలు చోటుచేసుకున్నా ప్రజలు అలాంటి సంఘటనల పట్ల అప్రమత్తంగా ఉండే విధంగా అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా వైట్‌కాలర్ మోసాలు, సైబర్‌నేరాల పట్ల ప్రజలను చైతన్య పరిచేందుకు ఎంతో కృషి చేశారు. వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్న కోటిరెడ్డి తన కిందిస్థాయి అధికారులు, సిబ్బందితోనూ మంచిగా మెలిగేవారన్న పేరు తెచ్చుకున్నారు. ఇదిలా ఉంటే, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలతో జిల్లాకు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇద్దరూ కొత్త అధికారులు రానున్నారు. జిల్లాకు బదిలీపై వస్తున్న నారాయణరెడ్డి ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది. కాగా నారాయణరెడ్డి స్థానంలో నార్కోటిక్(ఎన్‌సీ) స్పెషల్ ఇంటలీజెన్స్ బ్యూరో(ఎస్‌బీ) సూపరిండెంట్‌గా పని చేస్తున్న బి.రాజేష్ బదిలీపై వచ్చారు. మంగళవారం ఆయన శంషాబాద్ జోన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

### మేడ్చల్ డీసీపీ నితికా పంత్ బదిలీ

మేడ్చల్ డీసీపీ నితికా పంత్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ జోన్ డీసీపీగా వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డిని నియమించగా, అక్కడ పనిచేస్తున్న నితికా పంత్‌ను ఆదిలాబాద్ జిల్లా, యాపాలగూడలోని టీజీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు.

# దంచికొట్టిన వాన

### శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరులో అత్యధికంగా 73.3మిల్లీ మీటర్ల వర్షపాతం



ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వర్షం

రంగారెడ్డి అర్బన్/ఘట్‌కేసర్, జూన్ 17 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిరిగి జిల్లాలో సోమవారం పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. వాహనాదారులు ఇబ్బంది పడ్డారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరులో అత్యధిక వర్షపాతం 73.3మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శంకర్‌పల్లిలో 71 మిల్లీ మీటర్లు, మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 61 మిల్లీ మీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తుర్కయంజాల్‌లో 47.3మిల్లీ మీటర్లు, శేరిలింగంపల్లి మండల మదాపూర్‌లో 36 మిల్లీ మీటర్లు, రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం-అత్తాపూర్ వద్ద 30.8 మిల్లీ మీటర్లు, శేరిలింగంపల్లి మండల అర్బన్ హెల్త్‌సెంటర్ వద్ద 28.5 మిల్లీ మీటర్లు, మొయినాబాద్‌లో 28.3 మిల్లీ మీటర్లు, రాజేంద్రగనర్ మండలం శివరాంపల్లి సబ్‌స్టేషన్, మైలార్‌దేవ్‌పల్లిలో 28మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మేడ్చల్ జిల్లా మేడిపల్లి పరిధి మునిసిపల్ ఆఫీస్ వద్ద 39మిల్లీ మీటర్లు, ఉప్పల్ పరిధి జీహెచ్ఎంసీ జోనల్ ఆఫీస్ వద్ద 36.8 మిల్లీ మీటర్లు, మేడిపల్లి పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 35.5 మిల్లీ మీటర్లు, ఘట్‌కేసర్ మండలం సింగపూర్ టౌన్‌షిప్ వద్ద 34 మిల్లీ మీటర్లు, బాల్‌నగర్ మండలం మూసాపేట్ వద్ద 31.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నాలుగు రోజులుగా బాగా ఎండ కాయడంతో జనం ఇబ్బంది పడ్డారు. సోమవారం సాయంత్రం మొయినాబాద్ మండలంలో చిరుజల్లులు కురవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. పొలాల్లో నీరు నిలిచింది. చేరింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షను నిలిచింది. శంకర్‌పల్లి మండలం శంకర్‌పల్లి, ఫత్తేపురం, రామంతాపూర్, ఎల్వర్తి, మోకిల, పిల్లిగుండ్ల, టంగటూరు, ప్రొద్దటూరు గ్రామాల్లో వర్షం కురిసింది. విత్తనాలు వేయని రైతులు విత్తనాలు పెట్టేందుకు సమాయత్తం అయ్యారు. ఎండుతున్న మొలకలకు వర్షం జీవం పోసింది. ఘట్‌కేసర్‌లో భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా వర్షం రాక ఎండాకాలాన్ని తలపించింది. ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. భారీ వర్షంతో జనం ఉపశమనం పొందారు.

# కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

కీసర, జూన్ 17: మహాశైవ క్షేత్రమైన కీసరగుట్ట ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఏకాదశి సెలవు రోజు కావడంతో సోమవారం భక్తులు అధిక సంఖ్యల్లో ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేకపూజలు చేశారు. అదేవిధంగా రద్దీ దృష్ట్యా ఆలయం పైకి వాహనాల రాకపోకలు నిలిపి వేసి వాహనాలను దిగువ ప్రాంతంలోనే నిలిపేశారు. కుటుంబ సమేతంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యల్లో రావడంతో సోమవారం కీసరగుట్టలో సందడి నెలకొంది.



స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు

# అంతారం పెద్ద చెరువుకు గండి

● పంట పొలాలు నీట మునిగే ప్రమాదం

● ఆందోళనలో అన్నదాతలు

తాండూరు రూరల్, జూన్ 17: మండలంలోని అంతారం గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువుకు గండిపడింది. కొంతకాలంగా కురుస్తున్న వర్షానికి పెద్ద చెరువు ఆయకట్టు వద్ద పెద్ద గుంత ఏర్పడింది. మరోసారి భారీ వర్షం కురిస్తే ఆయకట్టు గండి పడే అవకాశముందని రైతులు అంటున్నారు. అదే జరిగితే నీరంతా పొలాల్లోకి వెళ్లి పంట నీటమునిగే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే చెరువు వద్ద ఏర్పడిన గుంతకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.



ఇటీవల కురిసిన వర్షానికి అంతారం పెద్ద చెరువుకు పడిన గండి



కొండారెడ్డిపల్లిలో కప్పకావడితో మహిళలు

## వానలు కురవాలని.. కప్పకావడి

కొడంగల్‌రూరల్, జూన్ 17: జిల్లాలోకి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించి ఈనెల మొదటి వారంలోనే వర్షాలు కురవడంతో రైతులు విత్తనాలు విత్తారు. ఆ తర్వాత వరణుడు ముఖం చాటేయడంతో విత్తనాలు మొలకెత్తినా మొలకలు వాడిపోతున్నాయి. దీంతో వర్షాలు కురవాలని గ్రామాల్లో కప్పకావడిలు, ఆలయాల్లో జలాభిషేకలు, భజనలు నిర్వహిస్తున్నారు. సోమవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో కప్పకావడిని (రోకలికి మధ్యలో కప్పను కట్టి దానిపై వేప ఆకులను ఉంచి) నిర్వహించారు. ఇంటింటికి తిరుగగా మహిళలు దానిపై బిందెలతో నీళ్లు పోసి వానలు కురవాలని మొక్కుకున్నారు. కప్పకావడి కడితే వరుణదేవుడు కరుణించి విస్తారంగా వర్షాలు కురుస్తాయని గ్రామస్థుల విశ్వాసం. ఈ కార్యక్రమంలో మల్కమ్మ, కాశమ్మ, బుజ్జమ్మ, బుగ్గమ్మ, నర్సమ్మ, కాశమ్మ, ఆశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ‘శ్రీ చైతన్య పాఠశాలకు అనుమతి లేదు’

తాండూరు రూరల్, జూన్ 17: పట్టణంలోని సాయిపూర్‌లో కొనసాగుతున్న శ్రీచైతన్య పాఠశాలకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని ఎంఈవో వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి శ్రీచైతన్యలో విద్యార్థులను చేర్పించవద్దని సూచించారు. ఇప్పటికే ఆ పాఠశాలకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జగన్‌సింగ్

## ‘సత్యసాయి’ సేవలను ప్రజలకు చేరవేయాలి

వికారాబాద్, జూన్ 17: శ్రీసత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న సేవలను ప్రజలకు చేరవేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు జగన్ సింగ్ అన్నారు. ఆయన అధ్యక్షతన సత్యసాయి సేవా సంస్థ వికారాబాద్ జిల్లా సమావేశాన్ని వికారాబాద్ శ్రీసత్యసాయి జ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీ వాసుదేవరావుతో పాటు ప్రశాంతి నిలయం సేవా కోఆర్డినేటర్ యాదగిరి రావు అలాగే రాష్ట్ర బాలవికాస్ ఇన్‌చార్జి హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ గీతా పావని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారి శతజయంతోత్సవాలను పురస్కరించుకొని సత్యసాయి సేవాసంస్థలు నిర్వహించే సేవా కార్యక్రమాలు, ప్రశాంతి నిలయంలో నిర్వహించే సేవలను వివరించారు. అదేవిధంగా ప్రతీ సమితిలో బాలవికాస్ ప్రాముఖ్యత, మహిళా సేవాదళ్ ప్రాముఖ్యత, సేవాదళ్ సభ్యులు ప్రశాంతి నిలయంలో పాల్గొనే సేవా ప్రాముఖ్యత గురించి అతిథులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న వికారాబాద్, తాండూర్, పరిగి, మాదారం, కెరెల్లి సమితుల కన్వీనర్లు డాక్టర్ సత్యనారాయణ గౌడ్, వీరేశం గౌడ్, అనంత్‌రావ్, రామకృష్ణారెడ్డి, బందెయ్య గౌడ్, ప్రభాకర్, వెంకటరెడ్డి, ప్రేమ్‌కుమార్, డీవైసీ బసవేశ్వర్, సునీల్, వేణుగోపాల్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



## టీజీ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం

కుక్కింద, దాదాపూర్ స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన టీజీ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు

- వికారాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి)

# ‘ఎంపీ’కి సమస్యల స్వాగతం

## రిజర్వాయర్ పూర్తిచేసి సాగు నీరు అందించాలి..

- సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై పరిశ్రమల ఏర్పాటు.. రహదారి విస్తరణకు పాటుపడాలి
- భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు, రైతుల విన్నపం

యాచారం, జూన్ 17 : భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన చామల కిరణ్ కుమార్‌రెడ్డి ముందు అనేక సమస్యలున్నాయి. పార్లమెంట్ స్థానంలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందనేది పలువురి అభిప్రాయం. ఇన్నాళ్లు నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నాయి. ప్రజాప్రతినిధులు మా గోడు విని సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని పలువురు నాయకులు పేర్కొంటున్నారు.



తాటిపర్తిలోని బంధం చెరువు దుస్థితి

### సాగునీరు లేక ముందుకు సాగని సేద్యం

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలతో పాటు నల్గొండ జిల్లాలోని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు సాగు నీరందించడానికి గత పాలకులు సర్వే చేసి రిజర్వాయర్ పనులు ఆరంభించారు. డిండి నుంచి మర్రిగూడ మండలంలోని శివన్నగూడలోని రిజర్వాయర్‌కు నీరు తరలించడానికి కొంతమేర పనులు చేశారు. శివన్నగూడలో రిజర్వాయర్ పనులు 50 శాతం మేర పూర్తిచేశారు. డిండి నుంచి శివన్నగూడ వరకు నీరు రావడానికి కాలువల నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ కాలువల నిర్మాణం కూడా రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం వరకు చేపట్టారు. అయితే, కాంక్రీట్‌తో పూర్తిస్థాయిలో నిర్మాణం చేయకపోవడంతో వర్షాలకు కాలువలు పూడుకుపోయే పరిస్థితిలో ఉన్నాయి. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నేటికీ పరిహారం అందలేదు. శివన్నగూడ నుంచి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు సుమారుగా రెండు టీఎంసీల సాగునీరు అందించాల్సి ఉంది. సాగునీటి సమస్య తీర్చడం నూతన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముందున్న ప్రధాన సమస్య. సాగునీటి ఎద్దడి తీర్చకపోతే కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతి నిధులకు కష్టాలు తప్పవని రైతులు హెచ్చరిస్తున్నారు.

### కలగానే ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఏళ్ల తరబడిగా ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సాంకేతిక విద్యకు నోచుకోలేక, నగరానికి వెళ్లి చదువుకోలేక విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. యాచారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న నాలుగు గదుల నిర్మాణం కోసం నిధులు కేటాయించి గదులు పూర్తి చేయించాల్సి ఉంది.

### మరమ్మతులకు నోచుకోని రహదారులు

మంచాల మండలంలోని ఆరుట్ల నుంచి చౌటుప్పల్ మండలంలోని కోయలగూడెం వరకు రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ రహదారిని బాగు చేయాలని గతంలో ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని స్థానికులు వాపోయారు. ఈ రహదారి మరమ్మతులకు రూ.50 కోట్ల నిధులు కేటాయించాలని అధికారులకు ప్రజాప్రతినిధులు విన్నవించారు. రెండు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి అని, ఎంపీ చొరవతోనే ప్రజలకు మేలు జరుగుతుందని కోరుతున్నారు.

### సాగర్ రహదారి వెంట పరిశ్రమలు స్థాపించాలి

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేయించాల్సి ఉంది. ఈ రహదారిపై పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల, మర్రిగూడ, చింతపల్లి మండలాలకు చెందిన వేలాది మంది యువతకు ఉపాధి దొరుకుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. చాలా కాలంగా నిరుద్యోగులు ఉపాధిలేక నరకం అనుభవిస్తున్నారని, నూతనంగా ఎంపీగా గెలుపొందిన కిరణ్‌కుమార్‌రెడ్డి సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి అభివృద్ధి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



శివన్నగూడలో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్

### యువతకు ఉపాధి కల్పించాలి



సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి. చాలామంది యువకులు ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రభుత్వ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయించాలి. మంచాల మండలంలోని రంగాపూర్ వద్ద గల నక్షత్రశాలలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి.

- కొప్పు బాషా, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

### సాగునీరు అందించాలి



ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల రైతులకు సాగు నీరందించేందుకు చొరవ తీసుకోవాలి. వ్యవసాయం చేయలేక ఎంతోమంది రైతులు నగరంలో తాపీమేస్త్రీలుగా జీవనం సాగిస్తున్నారు. ఎంపీ చొరవ తీసుకొని సాగునీరు అందించేందుకు కృషి చేయాలి. ఫార్మాసిటీని పూర్తిగా రద్దు చేయించి, రైతుల నుంచి సేకరించిన భూములను తిరిగి పంపిణీ చేయాలి.

- దంతుక పెద్దయ్య, నానక్‌నగర్ మాజీ సర్పంచ్

### ముందుకు సాగని సాగర్ రహదారి విస్తరణ పనులు

నగర శివారు బీఎన్‌రెడ్డి నగర్ నుంచి మాల్ వరకు నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి చాలా ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు లేన్ల రహదారిగా విస్తరించడానికి గతంలో ఎమ్మెల్యేగా ఉన్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో సర్వే చేయించారు. రహదారిపై ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిలు, కృష్ణా ఎయిర్‌వాల్వ్‌లను రహదారికి దూరంగా బిగించాల్సి ఉంది. ఇబ్రహీంపట్నం చెరువుకట్టతో పాటు కట్టకింద ఉన్న రహదారిని విస్తరించాలి. వీటన్నింటికీ సుమారు రూ.వంద కోట్ల మేర నిధులు అవసరమవుతాయని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ముందుకు సాగలేదు. ఇంతలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జరిగే పనులు కూడా ఆగిపోయాయి. ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఇరుకుగా ఉన్న సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి

## ఆస్పత్రి నిర్మాణానికి రూ.17కోట్లు మంజూరు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన

చేవెళ్ల, జూన్ 17 : చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వంద పడకల కోసం రూ.17కోట్లు మంజూరయ్యాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఎమ్మెల్యే డయాలసిస్ వార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో మరోసారి ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయాలసిస్ వార్డులో వైద్య సేవలు కొనసాగుతున్నాయన్నారు. రూ.17కోట్లతో చేవెళ్లలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించి సేవలందిస్తామన్నారు. నూతన ఆసుపత్రి నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండ్ సోమశేఖర్, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.



చేవెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

## పర్మినెంట్ చేయాలని డ్రైవర్స్ అసోసియేషన్ వినతి

శంషాబాద్, జూన్ 17: శంషాబాద్ జీఎంఆర్ ఎయిర్‌పోర్టులో గత 16 సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 70 మంది డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని జిల్లా లేబర్ జాయింట్ కమిషనర్‌కు అసోసియేషన్ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు డ్రైవర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డ్యూటీలో చేరిన కొత్తలో తమను 8ఏళ్లకే పర్మినెంట్ చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదన్నారు. ఇప్పటికైనా కార్మికులను పర్మినెంట్ చేసేలా కార్మిక శాఖ తగుచర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్టు ఆయన చెప్పారు.

## త్వరలోనే మాదిగ ఉపకులాల కల సాకారం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున మాదిగ

తాండూరు, జూన్ 17: ఎస్సీ వర్గీకరణ సాధించడానికి 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటం, కల త్వరలో నెరవేరబోతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. తాండూరులో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన మహత్తర పోరాటం దేశ చరిత్రలోనే నిలిచిపోతుందన్నారు. మాదిగలకు వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అన్యాయాన్ని న్యాయస్థానం పరిశీలిస్తుందన్నారు. మాదిగ, ఉపకులాలు విజయోత్సవాలు జరుపుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు మాదిగ, అధికార ప్రతినిధి ప్రకాష్ పాల్గొన్నారు.

## కురిసిన తొలకరి.. అందని సబ్సిడీ విత్తనాలు

- ఎదురు చూస్తున్న రైతన్నలు



తాండూరు రూరల్, జూన్ 16: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. అందుకు అనుగుణంగా తొలకరి వర్షాలు కూడా కురిశాయి. అయితే రైతులు విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమయ్యారు. తాండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో 45,000 ఎకరాల్లో పత్తి, 61వేల ఎకరాల్లో కంది, 7500ఎకరాల్లో పెసర, 7000ఎకరాల్లో మినుము, 35వేల ఎకరాల్లో వరి, 2500 ఎకరాల్లో సోయాబీన్ వంటి పంటలు వేసుకునేందుకు రైతులు ఇప్పటికే పొలాలను చదును చేసుకుని సిద్ధం చేశారు.

### లభించని సబ్సిడీ విత్తనాలు

ప్రభుత్వం రైతులకు కంది, పెసర, మినుము, సోయాబీన్ వంటి విత్తనాలు ఇప్పటి వరకు సబ్సిడీపై అందలేదు. దీంతో రైతులు విత్తనాల కోసం వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా కంది విత్తనాలు 2,318 క్వింటాళ్లు, పెసర 227 క్వింటాళ్లు, మినుము 188 క్వింటాళ్లు, మొక్కజొన్న 151క్వింటాళ్లు, వడ్లు 7,936క్వింటాళ్ల విత్తనాలు అవసరముంటాయని వ్యవసాయాధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించారు. అయినప్పటికీ ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు ఇప్పటికీ విడుదల చేయకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు.

### ప్రైవేట్‌లో విత్తనాలకు అధిక ధరలు

ప్రైవేటులో రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలంటే డబ్బులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. కంది, మినుము, మొక్కజొన్న లాంటి విత్తనాలు కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున డబ్బులు అవసరమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రధానంగా రైతులు రోహిణి, మృగశిరకార్తెలో విత్తనాలు విత్తుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతుల నమ్మకం. రోహిణికార్తె ముగిసినప్పటికీ కనీసం ఆరుద్రకార్తె ముగిసేలోపైనా సబ్సిడీ విత్తనాలను ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు సబ్సిడీ విత్తనాలు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈసారి కూడా పంట దిగుబడులు తాండూరు ప్రాంతం గణనీయంగా తగ్గిపోయే అవకాశముందని రైతులు వాపోతున్నారు.

## రామారావు జోషి సేవలు స్ఫూర్తిదాయకం

- తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్


వికారాబాద్, జూన్ 17: తెలంగాణ ఉద్యమంలో రామారావు జోషి పంతులు పోషించిన క్రియాశీలక భూమిక ఎందరికో స్ఫూర్తిదాయకమని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ కొనియాడారు. న్యూనాగార్జున హైస్కూల్ వ్యవస్థాపక సభ్యుడు, టీజేఏసీ జిల్లా నేత రామారావుజోషి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన టీజేఏసీ జిల్లా మాజీ చైర్మన్ శ్రీనివాస్, స్కూల్ యాజమాన్య సభ్యులతో కలిసి ఆయన రామారావు జోషి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన రామారావుజోషి ఎంతోమంది విద్యావంతులు, వ్యాపారులకు స్ఫూర్తినిచ్చారని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి ఏ పిలుపునిచ్చినా ఆయన ముందుండేవారని గుర్తుచేశారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత వికారాబాద్ నియోజకవర్గంతో జిల్లా అభివృద్ధిపై పౌర వేదికల్లో చర్చించే వారని ఆయన అన్నారు. ప్రాంతం, ప్రజల గురించి ఎప్పుడూ చర్చించే వారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా రామారావు జోషి చేసిన సేవల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయరెడ్డి, రాజరత్నం, మాణిక్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, రవి, ప్రిన్సిపాళ్లు శైలశ్రీ, బాబురావు, కుటుంబ సభ్యులు రాకేష్ జోషి, చంద్రకాంత్ జోషి పాల్గొన్నారు.



రామారావు జోషి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శుభప్రద్ పటేల్, న్యూనాగార్జున యాజమాన్య సభ్యులు

## అక్కడ అమలు.. ఇక్కడ ఎప్పుడో?

- పింఛన్ల పెంపుపై చర్చ



తాండూరు, జూన్ 17: పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పెంపు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల హామీ మేరకు ఏప్రిల్ నుంచి పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చాక అమలులోకి తేవడంతో తెలంగాణ పింఛన్ల పెంపు ఎప్పుడో అంటూ పట్టణాలు, పల్లెల్లో చర్చ మొదలైంది. గత డిసెంబర్‌లో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 100రోజుల్లో హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రసుత్తం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తోంది. అయినప్పటికీ సామాజిక పింఛన్ల పెంపుపై సర్కార్ ఇంతవరకు దృష్టి సారించలేదు. దీంతో పింఛన్ల పెంపు ఇప్పట్లో సాధ్యమేనా? అనే ప్రశ్నలు ప్రజల మనసుల్లో మెదులుతోంది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న రూ.2100, 3100ల నుంచి చేయూత పథకం కింద ప్రతి నెల పింఛన్‌ను రూ.4వేలకు చేస్తామని దివ్యాంగులకు రూ.6వేల వరకు పెంచుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆసరా పింఛన్ల పేరిట సామాజిక పింఛన్ల పథకం అమలవుతోంది. ప్రధానమైన ఆరు గ్యారంటీల్లో పింఛన్ల పెంపునకు సంబంధించి చేయూత పథకమూ ఒకటి. రాష్ట్రంలోని వయోవృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లు గీతకార్మికులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు, హెచ్ఐవి బాధితులకు పెన్షన్లకు అమలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరందరూ సర్కారు ఎప్పుడు పెన్షన్ పెంచుతుందోనని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో బడ్జెట్‌లో ఉండడం, రైతుభరోసా, రైతు రుణమాఫీ ప్రధాన అంశాలుగా ముందుకెళ్తున్న తరుణంలో పింఛన్ల పెంపు మరో రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయని అధికారులు అంటున్నారు.

### పొరుగు రాష్ట్రంలో పింఛన్ల పెంపు అమలు

పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతూ జీవో జారీ చేశారు. వయోవృద్ధులులు, కుష్టు బాధితులకు రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచారు. పూర్తి వైకల్యం, పక్షపాత బాధితులు, మంచం పట్టిన వారు, సాధారణ డయాలసిస్, కిడ్నీ, గుండె, లివర్ మార్పిడి బాధితులకు రూ.5వేల నుంచి రూ.15వేల పింఛన్లను పెంచారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

## పరిగి ఆర్టీసీ డిపోకు కొత్తగా 17 బస్సులు

పరిగి, జూన్ 17: పరిగి డిపోకు కొత్తగా 17 ఆర్టీసీ బస్సులను తెప్పించినట్లు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరిగి బస్ స్టేషన్ నుంచి కొత్తగా మరికల్-మహబూబ్‌నగర్, ముజాహిద్‌పూర్, పగిడ్యాల్, కోత్లాబాద్ రూట్లలో బస్సులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రద్దయ్యాయని తెలిపారు. అయితే ఆ రూట్లలో బస్సులను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి పరిగికి కొత్తగా 17బస్సులను మంజూరు చేయించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణంలో లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పరిగి మీదుగా రైల్వేలైన్ సర్వేకు రూ.18 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం కరుణశ్రీ, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ ప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, నాయకులు బీఎస్ ఆంజనేయులు, భరత్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లకు ఎమ్మెల్యే సన్మానం

పెద్దేముల్, జూన్ 17: కోట్‌పల్లి మార్కెట్ కమిటీలో చైర్మన్‌గా అంజయ్య, వైస్‌చైర్మన్‌గా సాయిని నారాయణరెడ్డిలు నూతనంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారిని స్థానిక ఎమ్మెల్యే సన్మానించి అభినందనలు తెలిపారు. మంబాపూర్ గ్రామంలోని సాయిని నారాయణరెడ్డి ఇంటి వద్ద ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వారికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యాలటి శ్రీనివాస్, నాయకులు ఉప్పరి మల్లేశం, కోట్‌పల్లి బంద్యప్ప, షైపుస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మంబాపూర్ గ్రామంలో చైర్మన్, వైస్‌చైర్మన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే


కొడంగల్ రూరల్: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


మోమిన్‌పేట్: టేకులపల్లిలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న యువకులు


బొంరాస్‌పేట్: బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు వెళ్తున్న ముస్లిం మత పెద్దలు


కొడంగల్: హస్నాబాద్‌లో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు


వికారాబాద్: ఆలంపల్లి ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్


పరిగి: ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి


వికారాబాద్: బక్రీద్ వేడుకలో చిన్నారులు

వికారాబాద్, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఆనందోత్సవాలతో నిర్వహించుకున్నారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని సోమవారం ఈద్గాల్లో వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బక్రీద్ విశిష్టత గురించి వివరించారు. అనంతరం ముస్లింలను ముస్లింలు, హిందువులు ఇతరులు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గాల వద్దకు వివిధ రాజకీయ పార్టీల నేతలు ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పారు.

**ధారూరు:** బక్రీద్ పండుగను మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. పేదలకు మాంసాన్ని పంచిపెట్టారు. కొంతమంది తలనీలాలు సమర్పించుకున్నారు.

**తాండూరు:** ఈద్ - ఉల్ - జిహా (బక్రీద్) సందర్భంగా తాండూరు పట్టణంలోని చెనెగేషపూర్ రోడ్డులో, ముర్షాద్ దర్గా చౌరస్తా సమీపంలోని హైదరాబాద్ రోడ్డు మార్గం ఖాంజాపూర్ గేటు వద్దనున్న ఈద్గాకు ముస్లీంలు తరలి వచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా సామూహిక ప్రార్థనలకు హజరయ్యారు. చెనెగేషపూర్ రోడ్డులోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ మహేందరొరెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌లు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, కరుణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

**తాండూరు రూరల్:** మండలంలోని గోపన్‌పల్లి, గౌతాపూర్, మల్కాపూర్, జినుగుర్తి, సంగెం కలాన్, కొత్లాపూర్, ఉదండాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో పండుగను భక్తిశ్రద్దలతో నిర్వహించుకున్నారు. ఉదయం ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దైవ ప్రవక్త, ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారు.


మేడ్చల్ టౌన్: పెద్ద మసీదులో ముస్లింల ప్రార్థనలు

**యాలాల:** మండలంలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గ్రామాలతో పాటు యాలాలలో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ఈద్గా వద్దకు ముస్లింలు తరలి వచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు.

**పెద్దేముల్:** మండలంలో ముస్లింలు బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాదుల వద్ద ఆయా కుటుంబాలకు సంబంధించిన వారు పూలువేసి నివాళులర్పించారు.

**పరిగి:** బక్రీద్ సందర్భంగా పరిగి పట్టణంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలు, మసీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ పఠించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ రోజు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పరిగిలో గల అనంతరెడ్డినగర్‌లోని ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ప్రవీణ్‌రెడ్డిలు వేర్వేరుగా ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**పూడూరు:** బక్రీద్ పండగను మండల కేంద్రంతో పాటు సోమవారం వివిధ గ్రామాల్లో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు.

**కొడంగల్:** బక్రీద్ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కొడంగల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ముస్లిం సోదరులు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాల్లో మత గురువులు బక్రీద్ పండగ విశిష్టతను వివరించారు. కొడంగల్ పట్టణంలోని జామే మస్జిద్ నుంచి ముస్లిం సోదరులు ర్యాలీగా ఈద్గాకు చేరుకొని సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దోమ మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు కె.రాజీరెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.


తాండూరు: ఖాంజాపూర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

**మేడ్చల్ టౌన్:** మేడ్చల్‌లోని పలు మసీదుల్లో ఉదయం 7 గంటల నుంచి 10గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదులకు విచ్చేసే ముస్లింల కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టారు. మేడ్చల్ పాత మసీదులో, అత్వెల్లి ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మసీదుల వద్ద బందోబస్తును ఏర్పాటుచేశారు. పట్టణంలో ఎనిమిది మసీదులు ముస్లింలతో కిటికిటలాడాయి. పండుగ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**కీసర:** బక్రీద్ వేడుకలు కీసరలో ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయమే ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**శామీర్‌పేట:** శామీర్‌పేట, తూంకుంట మున్సిపాలిటీల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. శామీర్‌పేట, అలియాబాద్, తుర్కపల్లి తదితర గ్రామాల్లో ఉదయం ఈద్గాలోకి, మసీదుల్లో ప్రార్థనలు చేశారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండగ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర హజ్ కమిటి సభ్యుడు ముజీబుద్దీన్ తెలిపారు.

**ఘట్‌కేసర్:** బక్రీద్ పండుగను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడలో గల ఈద్గాలో బక్రీద్ సందర్భంగా షామియానాలు వేసి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా పార్టీల నాయకులు సైతం ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.


తాండూరు: ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


దోమ: ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి


పూడూరు: ఈద్గాలోప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


శామీర్‌పేట: తూంకుంటలోని ఈద్గాలో ముస్లింలతో నాయకుడు రాంచందర్‌యాదవ్


పరిగి: ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్


పెద్దేముల్: మంబాపూర్ ఈద్గావద్ద ముస్లింల అలాయ్‌బలాయ్


వికారాబాద్: దర్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


తాండూరు రూరల్: మల్కాపూర్ శివారులో ఈద్గావద్ద ముస్లింలు

## ఏఆర్ కానిస్టేబుల్‌కు ఎస్పీ పరామర్శ


కానిస్టేబుల్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

వికారాబాద్ , జూన్ 17: వికారాబాద్ శిక్షణ కేంద్రం లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కిషన్‌జీ ఆదివారం రాత్రి భోజనానికి వచ్చి తిరిగి విధులకు వెళ్లే క్రమంలో బైక్ పైనుండి పడి గాయాలపాలయ్యాడు. ఆయనను వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కోటిరెడ్డి ఆస్పత్రికి వెళ్లి కిషన్‌జీని పరామర్శించారు. పోలీస్‌శాఖ ద్వారా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్పీ వెంట ఏఆర్‌డీఎస్పీ వీరేష్, ఆర్ఐ డేవిడ్ తదితరులు ఉన్నారు.

## దౌల్తాబాద్ నూతన ఎస్ఐగా రవిగౌడ్


బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ రవిగౌడ్

దౌల్తాబాద్, జూన్ 17: దౌల్తాబాద్ నూతన ఎస్ఐగా రవిగౌడ్ ఉద్యోగ బాధ్యత లు స్వీకరించారు. గతంలో కొడంగల్, దోమ పోలీస్‌స్టేషన్‌లలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయన సోమవారం దౌల్తాబాద్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న శ్రీశైలంయాదవ్ వికారాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవిగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## ఎంపీ పౌర సన్మానికి తరలిరావాలి

ధారూరు, జూన్ 17: లోకసభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి జరిగే పౌరసన్మానానికి బీజేపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఎం.రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకనంద రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 19న వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణరెడ్డి గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

# కొత్త బస్ సర్వీసులు ప్రారంభం


తాండూరులో కొత్త బస్ సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు, జూన్ 17: తాండూరు ఆర్టీసీ డిపోలో సోమవారం తాండూరు కొత్తూర్ వయా యాలాల, దేవనూర్ నూతన సర్వీసును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయా గ్రామాల ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆర్టీసీ డిపో మేనేజర్ మమత, నాయకులు పటోళ్ల బాల్‌రెడ్డి, కరుణం పురుషోత్తం రావు, డాక్టర్ సంపత్‌కుమార్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**కులకచర్ల:** గ్రామానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో సోమవారం మరికల్ నుంచి మహబూబ్‌నగర్ వయా ముజాహిద్‌పూర్ బస్సును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, బాలకృష్ణ, నర్సింహ, పులింగ, చిన్న వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్:** మండలంలోని కొత్తూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించారు. కొంత కాలంగా ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన రద్దీ పెరగడంతో సీఎం రేవంత్‌రెడ్డి తాండూర్ డిపోకు 32బస్సులను కేటాయించారు. కొత్తూర్ గ్రామానికి సోమవారం తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాన్ని మనోహర్ రెడ్డి కొత్త బస్సును జెండాఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఆర్టీసీ డిపో అధికారులు, గ్రామ ఎంపీటీసీ ఉమాదేవి భీమ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భీమ్‌రావు, ప్రవీణ్, మహేందర్, బాలప్ప, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్న ముజాహిద్‌పూర్ గ్రామస్థులు

## మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన నాయకులు


కేసీఆర్‌తో వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 17: శామీర్‌పేట మండల బీఆర్ఎస్ యూత్ నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఆయన ఫామ్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని కేసీఆర్ సూచించారని తెలిపారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


నగదును అందజేస్తున్న మాజీ సర్పంచ్

కీసర, జూన్ 17: మండలంలోని చీర్యాల్ గ్రామంలోని గ్రామదేవత ఆలయ పునర్నిర్మానానికి మాజీ సర్పంచ్ విరాళాన్ని అందజేశారు. గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు మాజీ సర్పంచ్ తుంగ ధర్మేంధర్ సోమవారం రూ.2లక్షల 10వేలు విరాళంగా అందజేశారు.

## ఆర్థిక సాయం

మేడ్చల్ టౌన్, జూన్ 17: అనారోగ్యంతో మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ కుటుంబానికి స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మణికంఠ గౌడ్ అండగా నిలిచారు. పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ వాసి వినయ్ భార్య హిమబిందు అస్వస్థతతో మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఆమె చికిత్స నిమిత్తం రూ.3లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలపడంతో స్థానిక కౌన్సిలర్ మణికంఠగౌడ్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.30వేలు అందజేశారు.

# డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం


మేడ్చల్ టౌన్: రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు


తాండూరు: భవానీ నగర్‌లో మురుగుకాల్వ

మేడ్చల్ టౌన్, జూన్ 18: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 3వ, వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీరు వీధుల్లోని రోడ్డుపై పొంగుతోంది. వార్డులో ఏర్పాటుచేసిన డ్రైనేజీ పైప్‌లేన్ పాతపడటంతో నిత్యం మ్యాన్‌హోల్స్ జామ్ అవుతున్నాయి. కాలనీవాసులు పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు తెలిపినప్పటికీ వారు నామమాత్రపు మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు వర్షాకాలంలో కురిసే చిన్న పాటి వర్షానికి వార్డులోని ఇందిరమ్మ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వర్షాకాలంలో కాలనీ పరిసరాల్లో నలిచిన మురికి నీరు కారణంగా కొంతమంది డెంగీ బారినపడ్డారని కాలనీ వాసులు తెలిపారు. అధికారులు స్పందించి తమ కాలనీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**తాండూరు:** స్థానిక భవానీనగర్ కాలనీలో ఈ మురుగు కాల్వ నిండి 15రోజులు అవుతోందని మురుగునీరు కాల్వలోనే నిలిచిపోయి దుర్వాసన వస్తుందని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు. దర్గా పక్క నుంచి చివరి వరకు ఉన్న మురుగు కాల్వ నిండి పేరుకుపోయింది. మున్సిపల్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇదే మార్గంలోని రాయల్‌కంట సమీపంలోని మురుగు కాల్వనిండి నెలరోజులు అవుతోందని తెలిపారు.

**కొడంగల్ రూరల్:** మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీరు సీసీ రోడ్డుపై పారుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందింఇచ గ్రామంలో సైడ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


కొడంగల్ రూరల్: ధర్మాపూర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు



## క్రైం కార్నర్

### రెండు వాహనాలు ఢీ.. ఆరుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు, ట్రాలీ ఆటో

మోమిన్‌పేట్, జూన్ 17: ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొని ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మోమిన్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. 108 అంబులెన్స్ సిబ్బంది కృష్ణ, మల్లేశం, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సయ్యద్‌అలీపూర్ గ్రామానికి చెందిన పి.మహేందర్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి, మహేందర్, అశోక్ లేల్యాండ్ ఆటోలో మోమిన్‌పేట్ నుంచి సయ్యద్ అలీపూర్ గ్రామానికి వెళ్తున్నారు. వెల్చాల్ సమీపంలోని ఓ కంపెనీలో పని చేస్తున్న ఆరుగురిని ఇళ్లకు చేరవేసేందుకు కంపెనీ వాహనంలో మోమిన్‌పేట వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మోమిన్‌పేట్ సమీపంలో శుభకార్యాలు జరుపుకునే వేదిక ముందున్న ప్రధాన రోడ్డుపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మహేందర్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి, సురేష్ రమేశ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వారితో పాటు రమేశ్, రామకృష్ణ, సంతోష్‌రెడ్డి, మహేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వారిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. మహేందర్‌రెడ్డి కాళ్లు విరగడంతో ప్రైవేట్ వాహనంలో సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అరవింద్ తెలిపారు.

### చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, జూన్ 17: ఓ మహిళ మేడ్చల్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణంలోని ఎరుకల బస్తీ నివాసి మధుసూదన్ భార్య శివలక్ష్మి(28) సోమవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహం నీటిపై తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

### ఉరేసుకుని యువకుడు..

మేడ్చల్ టౌన్, జూన్ 17: చెట్టుకు ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన బి.సంతోష్(25) ఆదివారం రాత్రి ఇంట్లో గొడవపడి ఇంటి నుంచి వెళ్లాడు. సోమవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్లాటు స్థలం కబ్జా.. వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 17: ప్లాటు స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టిన ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ సంఘటన పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ సత్యసాయినగర్‌లోని సర్వే నెంబర్ 44 ప్లాటు నెంబర్ 241ను బోడుప్పల్ కార్పొరేషన్ దేవేందర్‌నగర్‌కు చెందిన బండ శ్యామల అనే మహిళ 2013లో కొనుగోలు చేశారు. 100గజాల విస్తీర్ణం కలిగిన ప్లాటు చుట్టూ కడీలు పాతి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల పక్క ప్లాటు యజమాని సురేష్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తూ 60గజాల స్థలాన్ని కబ్జాచేశాడు. ఇదేమిటని అడిగితే దిక్కున్నచోట చెప్పుకోమంటూ బెదిరింపులకు పాల్పడుతూ దుర్భాషలాడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ స్థలాన్ని తమకు అప్పగించాలని, లేదంటే మొత్తం స్థలాన్ని కొనుగోలు చేయాలని కోరినప్పటికీ నిరాకరించి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితురాలు వాపోయింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.